సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,550 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
32.4°/ 20.3°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి నుంచి పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పుట్టపర్తికి 120వ ర్యాంక్

- చివరి నుంచి మూడోస్థానంలో నిలిచిన మున్సిపాలిటీ

పుట్టపర్తి టౌన్: పురపాలక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకుల జాబితాలో పుట్టపర్తికి 120వ స్థానం లభించింది. 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో భాగంగా అధికారులు రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల్లో తాగునీటి సరఫరా, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాలు, రోడ్లు, వీధిదీపాలు, వరద నీటి నిర్వహణ, ఆదాయం తదితర 10 అంశాలను పరిశీలించి మార్కులు వేశారు. అందులో పుట్టపర్తికి మూడు పాయింట్లు రాగా, 120 స్థానంలో నిలిచింది. చివరి నుంచి మూడోస్థానంలో నిలిచింది. దీంతో స్థానిక మున్సిపల్ అధికారుల పనితీరు, అందిస్తున్న సేవలు ఎంత మేర ఉన్నాయో తేటతెల్లమైంది. ఇప్పటికైనా అధికారులు పనితీరు మార్చుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు



ముద్దాయిని కడప సబ్ జైల్‌కు తరలిస్తున్న పోలీసులు

రొళ్ల: అత్యాచారం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ అనంతపురంలోని నాల్గవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి టి.హరిత శుక్రవారం తీర్పు చెప్పారు. మడకశిర సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...రొళ్ల మండలం రంగనపల్లి గ్రామానికి చెందిన రామప్ప కుమారుడు సిద్ధరాజు అలియాస్ సిద్దయ్య 2018లో ఓ మహిళపై అత్యాచారం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్పట్లో రొళ్ల ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఉన్న ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మడకశిర సీఐలుగా ఉన్న బి.శుభకుమార్, కె.దేవానంద్ ఈ కేసును దర్యాప్తు చేసి అనంతపురం నాల్గో ఏడీజే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అలాగే ప్రస్తుత మడకశిర సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వీరాంజనేయులు, కోర్టు కానిస్టేబుళ్లు రవి, నరసింహమూర్తి తదితరులు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసు శుక్రవారం విచారణకు రాగా, ఏపీపీ సుజనారెడ్డి వాదనలు వినిపించారు. నాల్గవ ఏడీజే కోర్టు న్యాయమూర్తి టి.హరిత కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించి ముద్దాయి సిద్ధరాజు అలియాస్ సిద్ధయ్య నేరం చేసినట్లు రుజువైనందున అతనికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ముద్దాయిని పోలీసులు కడప సబ్ జైలుకు తరలించారు.

పాతదేవరపల్లిలో 'హోయసల' శాసనాలు



శాసనాలను చూపుతున్న దృశ్యం

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం పాతదేవరపల్లిలోని చెన్నకేశవ స్వామి ఆలయాన్ని 11వ శతాబ్దపు హోయసల రాజుల కాలంలో నిర్మించినట్లుగా తేలిందని, ఆ మేరకు శాసనాలు గుర్తించినట్లు చారిత్రక పరిశోధకులు, విశ్రాంత హెచ్ఎం వెంగన్న, ఉపాధ్యాయులు గోపి, కుమార్, సురేష్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో లభ్యమైన రాతి బండపై శ్రీకృష్ణదేవరాయులు 1511వ సంవత్సరంలో రాయించిన 4 శాసనాలను బట్టి చూస్తే చెన్నకేశవ స్వామి ఆలయాన్ని 11వ శతాబ్దంలో హోయసల రాజు మొదటి విష్ణువర్దన్ నిర్మించారని తెలుస్తోందన్నారు. ఆలయానికి పాతదేవరపల్లిలోనే 125 ఎకరాల మాన్యం భూమి కూడా ఉందని, ఆలయంలో వైష్ణవ ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు.





ధర్మవరంలో కదిరి గేటు వద్ద గుంతలమయమైన రహదారిపై వాహనదారుల పాట్లు ఇలా...

పడిలేస్తేనే.. ప్రయాణం


- ఆరోగ్యమంత్రి ఇలాకాలో రహదారులు అధ్వానం

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా కూటమి సర్కారులో కీలక మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న సత్యకుమార్ తన సొంత నియోజకవర్గం ధర్మవరాన్ని పూర్తిగా విస్మరించారు. దేశవ్యాప్తంగా తనకు పలుకుబడి ఉందంటూ ఆయన గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతుండగా... కనీస సౌకర్యాలకు నోచుకోక ధర్మవరంవాసులు తిప్పలు పడుతున్నారు. కనీసం రోడ్లు కూడా సరిగాలేక గుంతలమయమైన రహదారులపై పడుతూ లేస్తూ ప్రయాణం సాగిస్తున్నారు. ధర్మవరం పట్టణంలోనే రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇక నియోజక వర్గ వ్యాప్తంగా ఏ పల్లెకు వెళ్లినా అధ్వాన రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికేతరుడైన సత్యకుమార్‌ను గెలిపించి అసెంబ్లీకి పంపిన పాపానికి తమకు మంచి గుణపాఠం చెప్పారని ధర్మవరం వాసులు వాపోతున్నారు. కనీసం తమ బాధ చెప్పుకుందామన్నా ఆయన నియోజకవర్గంలో కనిపించడం లేదంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




బురదమయమైన బడన్నపల్లి గ్రామానికి వెళ్లే రహదారి



కంకరతేలి గుంతలు పడి అధ్వానంగా మారిన చింతలపల్లికి వెళ్లే రహదారి



ఓబుళనాయునిపల్లి నుంచి ధర్మవరం వరకు అధ్వానంగా మారిన రహదారి




గొట్లూరు నుంచి తుమ్మల రహదారి దుస్థితి ఇలా

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న 10.5 మి.మీ సగటుతో మోస్తరుగా వర్షం పడే సూచన ఉందని పేర్కొన్నారు. అలాగే 28న 3 మి.మీ సగటు వర్షపాతం నమోదు కానుందని తెలిపారు. 29, 30, 31 తేదీల్లో కూడా తుంపర్లు పడవచ్చని పేర్కొన్నారు

బుద్ధిగా ఉండకపోతే బహిష్కరణ తప్పదు

- రౌడీషీటర్లకు ఎస్పీ హెచ్చరిక



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం: రౌడీషీటర్లు బుద్ధిగా ఉండాలని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీయాక్ట్ ప్రయోగించి జిల్లా నుంచి బహిష్కరిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. జిల్లాలో నేరాల అదుపునకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం ఆయన హిందూపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోలీసు స్టేషన్లను తనిఖీ చేశారు. కేసుల నమోదు.. దర్యాప్తు తెలుసుకున్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నిబద్ధతతో పనిచేసే పోలీసులు ఉన్నారన్నారు. వారు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం..

శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ తెలిపారు. ఎవరిపై ఎక్కువ కేసులు ఉన్నాయో గుర్తించి వారిపై చర్యలు తీసుకునేలా పీడియాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఇక మతపరమైన అలజడులు, ఇబ్బందులు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతి భద్రతలకు భంగం కల్గించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మట్కా నిర్మూలన కూడా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న 'స్థానిక' ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ఇప్పటి నుంచే చర్యలు చేపడతామన్నారు.

దారి తప్పిన దర్యాప్తు!

- ఎస్‌బీఐ దోపిడీ కేసు దర్యాప్తులో పోలీసుల అలసత్వం
- రూ.12 కోట్ల చోరీలో.. రూ.2 కోట్లు మాత్రమే రికవరీ
- ఇప్పటికే పట్టుబడిన అనిల్ కుమార్ కట్టుకథను నమ్ముతున్న పోలీసులు
- మరో నిందితుడి వద్దే బంగారం ఉందని భావిస్తున్న వైనం
- మరి ఎవరా దొంగ.. ఎక్కడా బంగారు.. ప్రశ్నిస్తున్న జనం



సాక్షి, పుట్టపర్తి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన హిందూపురంలోని ఎస్‌బీఐ దోపిడీ కేసులో రికవరీ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. హిందూపురం పట్టణ శివారున తూమకుంట ప్రాంతంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లో గత జూలై 27వ తేదీ రాత్రి భారీ చోరీ జరిగింది. నిందితుడు పక్కా ప్లాన్‌తో బ్యాంకులోకి చొరబడి సుమారు రూ.12 కోట్ల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లాడు. లొకేషన్ దొరక్కుండా... శాటిలైట్ ఫోన్ వాడి.. బ్యాంకులోకి చొరబడ్డాడు. అయితే కేవలం రెండు సెకన్ల సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు హరియాణకు చెందిన మాజీ ఆర్మీ అధికారి అనిల్ కుమార్ పన్వార్‌గా గుర్తించి ఈనెల 6వ తేదీన అరెస్టు చేశారు.

దొంగ కథ.. పోలీసుల వంత..

ఎస్‌బీఐ దోపిడీ కేసులో నిందితుడైన అనిల్ కుమార్ పన్వార్‌ను పట్టుకున్న పోలీసులు.. అతని నుంచి కేవలం రూ.2 కోట్లు విలువైన బంగారు ఆభరణాలు మాత్రమే రికవరీ చూపించారు. మిగతా బంగారం ఎక్కడ ఉందనే విషయంపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. తనతో పాటు మరో నిందితుడు ఉన్నాడని.. అతడి వద్ద మిగతా బంగారం ఉందని అనిల్ కుమార్ పన్వార్ పోలీసులకు వెల్లడించినట్లు తెలిసింది. అయితే ఆ నిందితుడు ఎవరు.. ఎక్కడ ఉన్నాడనే దానిపై స్పష్టత లేదు. అనిల్ కుమార్ పన్వార్ చెబుతున్న మాటలను పోలీసులు ఎందుకు నమ్ముతున్నారు? అసలు ఏం జరుగుతోంది? అనేది తెలియాల్సి ఉంది.

దొంగ ట్రాప్‌లో పోలీసులు..

అనిల్ కుమార్ పన్వార్ చెప్పిన వివరాల మేరకు తూమకుంట బ్యాంకు దోపిడీ కేసులో ఇద్దరు పాల్గొన్నట్లు పోలీసులు నమ్ముతున్నారు. అయితే ఆ మరో వ్యక్తి ఎవరనేది పోలీసులు వెల్లడించలేదు. కానీ మరో నిందితుడో ఇంకో కేసులో రాజస్తాన్‌లో జైలు జీవితం అనుభవిస్తున్నట్లు సమాచారం. తూమకుంట బ్యాంకు దోపిడీలో మిగతా సొమ్ము అతడి వద్దనే ఉన్నట్లు అనిల్ కుమార్ పన్వార్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. నిజంగా అతడి వద్దనే బంగారం ఉందా? లేక పోలీసులు దొంగ అల్లిన కట్టుకథ ట్రాప్‌లో పడ్డారా అన్నది తెలియడం లేదు. ఎందుకంటే అనిల్ కుమార్ పన్వార్ చేసిన చోరీలన్నీ విభిన్నమైనవే. ఒక్కోసారి ఒక్కో స్టైల్‌లో దోపిడీ చేశాడు. కాలానికి అనుగుణంగా అప్‌డేట్ అవుతూ టెక్నాలజీ ఉపయోగించి దోపిడీలకు పాల్పడటం అతని స్టైల్. అలాంటి వ్యక్తి మాటలు నమ్మి పోలీసులు మరో నిందితుడి కోసం ఆరా తీస్తుండటం చర్చనీయాంశమైంది.

వ్యసనంతో పతనమై..

బ్యాంకు చోరీ కేసులో పట్టుబడిన నిందితుడు అనిల్ కుమార్ పన్వార్ వ్యసనాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకున్నట్లు తెలుస్తోంది. 2007లో ఆర్మీ నుంచి తిరిగొచ్చిన అతను.. జూదంలో భారీ మొత్తం కోల్పోయాడు. అనంతరం బ్యాంకులకు కన్నం వేయడం అలవాటుగా మార్చుకున్నాడు. ఇలా పదే పదే బ్యాంకుల్లో దోపిడీ చేస్తూ సుమారు 8 ఏళ్లు పైగా జైలు జీవితం అనుభవించాడు. చోరీ చేయడం.. జైలుకు వెళ్లడం.. బయటికి రావడం.. మళ్లీ దొంగతనం చేయడం.. ఇదే జీవనశైలిగా మార్చుకున్నాడు. ఇప్పటి వరకు మొత్తం 14 బ్యాంకుల్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఏడాది జూన్‌లో జైలు నుంచి బయటికి వచ్చిన అతను... జూలైలో తూమకుంట ఎస్‌బీఐకి కన్నం వేశాడు. ప్రస్తుతం అరెస్టయి జైలు జీవితం అనుభవిస్తున్నాడు. పదే పదే చోరీలు చేస్తూ కటకటాల పాలవుతున్న అతన్ని పరామర్శించేందుకు కుటుంబ సభ్యులు కూడా రావడం లేదు. ఇటీవల తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా విషెస్ చెబుతూ 'ఇక నుంచి దొంగతనాలు మానేస్తా' అని మాట ఇచ్చినట్లు తెలిసింది.

బాలకృష్ణను పిచ్చాస్పత్రిలో చేర్చాలి



ఈరలక్కప్ప

మడకశిర: ''తనకు మెంటల్ ఉందని గతంలోనే బాలకృష్ణ వైద్యులతో ధ్రువీకరణ పత్రం తెచ్చుకున్నారు. అయితే ఆయన మానసిక స్థితి బాగుపడిందనుకున్నాం. కానీ గురువారం అసెంబ్లీలో ఆయన చేష్టలు చూస్తే పిచ్చి ముదిరినట్లు తెలుస్తోంది, వెంటనే పిచ్చాసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలి'' అని వైఎస్సార్ సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడిన తీరును చూసి తెలుగు ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. చిరంజీవిపై, మాజీ సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. ముఖ్యంగా హిందూపురం నియోజకవర్గం ప్రజలు మరింత బాధపడుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తికా.. తాము ఓట్లు వేసి అసెంబ్లీకి పంపించిందని మదనపడుతున్నారన్నారు. ఇక నిండుసభలో చిరంజీవిని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దూషించినా పవన్‌కళ్యాణ్ మిన్నకుండిపోవడం చూస్తే పదవుల కోసం అతను ఎంతలా దిగజారారో అర్థం అవుతోందన్నారు. ఇక తన స్థాయి మరచి జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో బాలకృష్ణ తూలనాడటం దిగజారిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వెంటనే వైఎస్ జగన్‌కు క్షమాపణ చెప్పాలని ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌ను మరోసారి దూషిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

పవన్ నైజం బయటపడింది



మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్ : సొంత అన్నను అవమానించిన వారిని ఒక్కమాట మాట్లాడని పవన్‌కళ్యాణ్ నైజమేమిటో ఇప్పుడిప్పుడే రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతోందని వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిండుసభలో ఎమ్మెల్యే బాలకృష్ణ తన అన్న చిరంజీవిని దూషించినా పవన్ కనీసం స్పందించకపోవడం ఆయన దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. అందుకే ఎక్కడో ఉన్న చిరంజీవే ఓ ప్రకటన విడుదల చేయాల్సి వచ్చిందన్నారు. కూటమి భాగస్వామి అయిన పవన్‌కళ్యాణ్ కనీసం తన ఉనికినైనా కాపాడుకోవాలన్నారు. ఇక మద్యం మత్తులో అసెంబ్లీకి వెళ్లి ఎలా పడితే అలా మాట్లాడుతున్న బాలకృష్ణ మరోసారి ఇలాగే వ్యవహరిస్తే తాటతీస్తామని మక్బూల్ హెచ్చరించారు. 'మెంటల్ బాలకృష్ణా...నోరు అదుపులో పెట్టుకో..లేకపోతే ఇబ్బందులు పడతావ్' అన్నారు. అసెంబ్లీలో దిగజారి మాట్లాడిన బాలకృష్ణను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టి 15 నెలలైనా హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం.. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. అందులో భాగంగానే బాలకృష్ణతో మాట్లాడించారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో



గాండ్లపెంట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న ప్రజలు

గాండ్లపెంట: వేళాపాలా లేని కరెంటు కోతలపై జనం కన్నెర్ర చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గాండ్లపెంట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేపలకుంట ఫీడర్‌లో నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీంతో రాత్రి వేళల్లో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వ్యవసాయ బోర్లు కూడా ఆడకపోవడంతో రైతులు పంటలు కోల్పోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం సోమయాజులపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు మండల కేంద్రానికి తరలొచ్చారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఆరు నెలలుగా లైన్‌మెన్ లేకపోవడంతో తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ సరఫరా నిలిచినా ఎవరికి చెప్పాలో తెలియడం లేదన్నారు. తనకల్లు ఏఈ మండల ఇన్‌చార్జ్ ఏఈగా ఉన్నారని, ఆయన ఎప్పుడు వస్తాడో కూడా తెలియడం లేదన్నారు. మండలానికి ఏఈని, తమ గ్రామానికి లైన్‌మెన్‌ను నియమించాలని డిమాండు చేశారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోగా, ఎస్‌ఐ ప్రసాద్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. విషయాన్ని విద్యుత్ శాఖ ఏడీ వరప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, రెండు రోజుల్లోపు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

అంగన్‌వాడీల్లో హాజరు పెంచండి

- ఐసీడీఎస్ సిబ్బందికి కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశం



ఐసీడీఎస్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

ప్రశాంతి నిలయం: అంగన్‌వాడీల్లో చిన్నారుల హాజరుశాతం పెంచి.. కేంద్రంలో నమోదైన వారంతా అంగన్‌వాడీకి వచ్చేలా చూడాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై సమీక్షించారు. తొలుత ఐసీడీఎస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ప్రగతిని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని కార్యక్రమాల్లో పురోగతి చూపి జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో చేర్చాలన్నారు. సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. సీడీపీఓలు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకి వచ్చే పిల్లలకు చదువు చెప్పడంతోపాటు సమయానికి పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి నెలా సకాలంలో పౌష్టికాహారం పంపిణీ జరగాలన్నారు. ప్రతి సెంటర్‌లో పరిస్థితులను బట్టి ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచాలన్నారు. పౌష్టికాహారం అవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రతి నెలా శాఖలో చేపట్టే కార్యక్రమాలపై సమీక్షిస్తామన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, సీడీపీఓలు నాగమల్లేశ్వరి, రాధిక, జయంతి, శాంతాలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా 'స్వచ్ఛతా హీ సేవ'..

జిల్లాలో విస్తృతంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కె.విజయానంద్‌కు వివరించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని, ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేయడంతో పాటు అవగాహన కూడా కల్పిస్తున్నామని సీఎస్‌కు వివరించారు.

క్లుప్తంగా

మద్యం తరలింపు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

గోరంట్ల: మద్యం అక్రమ తరలింపు కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించారు. ఈ మేరకు సీఐ శేఖర్ వెల్లడించారు. 2020, జూన్ 20 గోరంట్ల మండలం బూగానిపల్లికి చెందిన గంగాధర్, గుమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని గుర్తు చేశారు. అప్పటి గోరంట్ల సీఐ జయనాయక్ కేసు నమోదు చేసి, పెనుకొండ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. ఈ కేసులో తుది వాదనలు పూర్తి కావడంతో ముద్దాయిలకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.7,025 జరిమానా విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ శ్యామల వినిపించారన్నారు.

తపాలా కార్యాలయంలో చోరీ

కదిరి టౌన్: స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని కుటాగుళ్ల తపాలా కార్యాలయంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి కార్యాలయంలోకి చొరబడిన దుండగులు లాకర్‌లోని రూ.1,04,500 నగదు అపహరించారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన పోస్టుమాస్టర్ వంశీకృష్ణ.. చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నారాయణరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

లగోరికి పూర్వవైభవం


పాఠశాల విరామ సమయంలో లగోరి ఆడుతున్న విద్యార్థినులు


రాష్ట్ర స్థాయి విజేత ట్రోఫీని అందుకుంటున్న జిల్లా జట్టు (ఫైల్)

- లగోరి క్రీడపై పెరుగుతున్న ఆసక్తి
- రాష్ట్ర స్థాయిలో సత్తాచాటుతున్న 'పురం' విద్యార్థులు

హిందూపురం టౌన్: అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలు ఒక్కొక్కటిగా పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయి. ఇప్పటికే దేశాన్ని కబడ్డీ ఓ ఊపు ఊపేస్తుండగా... తాజాగా లగోరి క్రీడ ఆ జాబితాలోకి చేరుతోంది. దేశ సంస్కృతిలో ఓ భాగమైన లగోరి క్రీడకు చాలా ప్రాముఖ్యత ఉంది. దాదాపు 5 వేల సంవత్సరాల క్రితమే శ్రీకృష్ణుడు తన స్నేహితులతో కలసి చిన్నప్పుడు ఈ ఆటను ఆడినట్లుగా పురాణ ఇతిహాసం భాగవతం వెల్లడిస్తోంది. వివిధ ప్రాంతాల్లో లగోరి ఆటను పిట్టు గరం, 7 రాళ్లు, 7 పెంకులాట, సత్తాడు వంటి చాలా పేర్లతో పిలుస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో ఈ ఆట విశేష ప్రాచుర్యం పొందింది. ఇక్కడి విద్యార్థులు లగోరి ఆటలో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతున్నారు.

ఆట నియమాలు..

- ఆటలో పాల్గొనడానికి రెండు జట్లు ఉంటాయి. ప్రతి జట్టులో కనీసం 15 మంది ఆటగాళ్లు ఉంటారు. ఆరుగురు లోపల, ఆరుగురు బయట, ముగ్గురు బెంచ్‌లో ఉంటారు. మొత్తం 12 మంది ఆటలో పాల్గొంటారు.
- ఆటలో ఏడు పెంకులు (లేదా ఫైబర్ డిస్కులు), ఒక బంతి ఉంటాయి.
- ఒక జట్టులోని ఆటగాడు బంతితో పెంకుల కుప్పపైకి విసిరి, వాటిని పడగొడతాడు.
- పెంకులు పడగొట్టిన జట్టు క్రీడాకారులు తమను తాము ప్రత్యర్థి జట్టు క్రీడాకారులు బంతితో కొట్టకుండా తప్పించుకుంటూ, ఆ పెంకులను తిరిగి పేర్చడానికి ప్రయత్నించాలి.
- ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు బంతితో కొడితే, వారు ఆట నుండి తొలగించబడతారు.
- పెంకులను విజయవంతంగా పేర్చిన జట్టు గెలుస్తుంది, లేదా ప్రత్యర్థి జట్టులోని మిగిలిన ఆటగాళ్లందరినీ తొలగించిన జట్టుకు విజయం వరిస్తుంది.

ప్రాచుర్యంలోకి వస్తున్న లగోరి ఆట..

హిందూపురం ప్రాంతంలో చాలా కాలంగా లగోరి ప్రాచుర్యంలో ఉంది. చాలా మంది విద్యార్థులు పాఠశాల విరామ సమయంలో వినోదం కోసం ఈ ఆటను ఆడుతుంటారు. సెలవు రోజుల్లో కాలనీల్లో లగోరి క్రీడ సర్వసాధారణమై పోయింది. ఈ క్రమంలో లగోరిపై హిందూపురం ప్రాంత విద్యార్థులు పూర్తి స్థాయి పట్టు సాధించగలిగారు. గత నెల ఆగస్టు 7న జిల్లా లగోరి అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందూపురంలోని చిన్మయ విద్యాలయంలో 1వ జిల్లా స్థాయి లగోరి చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచిన హిందూపురం విద్యార్థులు పలువురు రాష్ట్ర స్థాయిలో పోటీలకు అర్హత సాధించారు. ఆగస్టు 17న వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల లగోరి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించిన హిందూపురంతో పాటు మడకశిర, పెనుకొండ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు తమ ప్రతిభతో జిల్లా జట్టును విజేతగా నిలిపారు.

సాంప్రదాయ ఆటకు గుర్తింపు



లగోరి ఆటకు రాష్ట్ర స్థాయిలో ప్రాముఖ్యత పెరుగుతోంది. తాజాగా కొన్ని రాష్ట్రాలలో లగోరి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా ఈ సాంప్రదాయ ఆటకు గుర్తింపు వస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఆట ద్వారా మన ఆలోచన విధానం, వేగం పెరుగుతాయి.

– జాహ్నవి, హిందూపురం

జిల్లాకు మంచి పేరు తెస్తా



లగోరి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ఈ ఆటను ప్రమోట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. లగోరి ఆటకు ప్రత్యేకమైన నియమాలు ఉన్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని జిల్లాకు మంచి పేరు తెస్తా.

– మోక్షిత, హిందూపురం

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతాం



రాష్ట్ర స్థాయిలో లగోరి ఆటను ప్రమోట్ చేస్తున్నారు. ప్రతి రాష్ట్రంలో లగోరి అసోసియేషన్‌లు ఏర్పాటయ్యాయి. మేము రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాం. జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొని సత్తా చాటాలని ఉంది.

– లిఖిత, హిందూపురం

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

హిందూపురం: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రిమాండ్ ఖైదీలకు ఆ సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. శుక్రవారం హిందూపురం సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. సబ్‌జైలు అధికారి హనుమప్ప ద్వారా ఖైదీల వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న వైద్య సేవలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి కేసుల విచారణలో అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామని, ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నాగభూషణం

కదిరి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్)గా పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొండవీటి నాగభూషణంను నియమిస్తూ కదిరి నియోజక వర్గానికి కేటాయించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మూగజీవాలపై విష ప్రయోగం


మృతి చెందిన గొర్రెలు


మృతి చెందిన ఆవు

సోమందేపల్లి: మండలంలోని పోలేపల్లిలో చెందిన పశువులపై దుండగులు విష ప్రయోగం చేశారు. ఎనిమిది గొర్రెలు, ఓ ఆవు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కురుబ మారుతి, అంజినమ్మ దంపతులు పాడి, జీవాల పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గొర్రెలతో పాటు ఓ ఆవును కొనుగోలు చేసేలా గురువారం ఓ వ్యక్తి అడ్వాన్సు చెల్లించి శుక్రవారం తోలుకెళతానని చెప్పి వెళ్లాడు. శుక్రవారం ఉదయం నిద్ర లేచే సరికి పాకలో ఉన్న ఎనిమిది గొర్రెలు, ఓ ఆవు మృతి చెందాయి. విష ప్రభావం కారణంగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లుగా గుర్తించారు. దాదాపు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బంగారు ఆభరణాల అపహరణ

ముదిగుబ్బ: స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో నివాసముంటున్న కొరవపల్లి రమణమ్మ ఇంట్లో గురువారం రాత్రి దుండగులు చొరబడి రూ.1.36 లక్షలు విలువ చేసే 6.8 తులాల బంగారు నగలు అపహరించారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి తన ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన అక్క ఇంట్లో నిద్రించినట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు. సీఐ శివరాముడు, సిబ్బంది శుక్రవారం ఉదయం బాధితురాలి ఇంటిని పరిశీలించి, క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీ

చిలమత్తూరు: మండలంలోని వీరాపురం ప్రధాన రహదారి చిన్నన్నపల్లి క్రాస్‌లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి మూలవిరాట్ కిరీటం, ఇత్తడి ప్లేట్లు, హుండీలోని భక్తుల కానుకలు అపహరించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ స్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిప్పేపల్లి గొల్ల విజయకుమార్ (25)గా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కొన్ని నెలల క్రితం జేసీబీ వాహనాన్ని కంతులకు కొనుగోలు చేశాడని, అయితే సరైన పనులు లేకపోవడంతో కంతులు చెల్లించలేక ఇబ్బందులు పడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అప్పు తీర్చకపోతే గ్రామంలో పరువు పోతుందని భయపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువతి..


పల్లవి (ఫైల్)

ధర్మవరం అర్బన్: ఉన్నత చదువులు అభ్యసించినా ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... ధర్మవరంలోని చంద్రబాబునగర్‌కు చెందిన బాలూ నాయక్, కుళ్లాయమ్మ బాయి దంపతుల కుమార్తె పల్లవి (23) ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేపట్టింది. నెలలు గడుస్తున్నా.. ఏ ఒక్క అవకాశమూ రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం అర్ధరాత్రి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం నిద్రలేచిన తల్లిదండ్రులు.. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను చూసి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

సంపులో పడి చిన్నారి మృతి


ఎం.ఎస్.ధోని

పరిగి: ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందాడు. పరిగి మండలం ఊటుకూరులో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వరప్ప, శిల్ప దంపతుల మూడేళ్ల వయసున్న కుమారుడు మహేంద్రసింగ్ ధోని (ఎంఎస్ ధోని) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సంప్‌లో పడిపోయాడు. కాసేపటి తర్వాత చిన్నారి కోసం గాలింపు చేపట్టిన తల్లిదండ్రులు.. సంపులో తేలియాడుతున్న చిన్నారిని గుర్తించి వెలికి తీసి, హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

రూ.15.38 లక్షల సొత్తు రికవరీ

- ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెనుకొండ: వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, రూ.15.38 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. ఏడాదిగా పెనుకొండ టౌన్, మరువపల్లి ప్రాంతాల్లో వరుసగా ఇళ్లలో దొంగతనాలు, పెనుకొండ, రొద్దం మండలాల్లోని వ్యవసాయ భూముల్లో విద్యుత్ కేబుల్ అపహరణలు చోటు చేసుకున్నాయన్నారు. ఆయా కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పెనుకొండ డీఎస్పీ నర్శింగప్ప నేతృత్వంలో సీఐ రాఘవన్, పెనుకొండ ఎస్ఐ.వెంకటేశ్వర్లు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా విడిపోయి నేరపరిశోధన వేగవంతం చేశారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 25న పెనుకొండ మండల పరిధిలోని పుట్టపర్తి క్రాస్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి గుడి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురిని ప్రశ్నించడంతో స్కూటీపై పరారయ్యేందుకు ప్రయత్నించారన్నారు. దీంతో వారిని అదుపులోకి తమదైన శైలిలో ప్రశ్నించడంతో 11 నెలల వ్యవధిలో ఆరు ఇళ్లలో దొంగతనాలు, 2 కేబుల్ అపహరణలకు పాల్పడినట్లు అంగీకరించారన్నారు. పట్టుబడిన వారిలో మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, బోయనరేష్, పెనుకొండ మండలం మరువపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ఉన్నారన్నారు. వీరి నుంచి రూ.15.38 లక్షల విలువ చేసే 132.870 గ్రాముల బంగారం, 127.980 గ్రాముల వెండి ఆభరణాలు, 770 మీటర్ల కేబుల్, స్కూటీ, ఇనుప రాడ్లు, స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

వంచకుడిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: పెళ్లి పేరుతో వంచనకు గురి చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. ధర్మవరంలోని శివరాంనగర్‌కు చెందిన ఓ యువతికి ఇదే పట్టణంలోని మహాత్మాగాంధీ కాలనీకి చెందిన మల్లెల వంశీతో 2024లో ఇన్‌స్టాగాం ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే యువతి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఆమె ఇలు విడిచి వెళ్లిపోయి వంశీ ఇంట్లోనే ఉంటూ వచ్చింది. అయితే వంశీ పెళ్లి చేసుకోకుండా కాలయాపన చేస్తుండటంతో ఆమె గట్టిగా నిలదీయడంతో నాలుగు నెలల క్రితం మదనపల్లి సమీపంలోని కలిచెర్ల గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ పెళ్లి కాకుండానే కాపురం పెట్టాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన వంశీ రోజూ తప్పతాగి ఇంటికి చేరుకుని కులం పేరుతో దూషిస్తూ యువతిని చిత్రహింసలకు గురి చేస్తూ వచ్చాడు. వంశీ తల్లి లక్ష్మి సైతం తనను కులం పేరుతో దూషిస్తుండటంతో తాళలేక యువతి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. అనంతరం ఉన్నత చదువుల కోసమని చిత్తూరులోని కళాశాలలో చేరింది. అయినా వంశీ తరచూ ఆమెకు ఫోన్‌లు చేస్తూ నిన్ను, మీ తల్లిదండ్రులను, మీ అక్కను అందరినీ చంపేస్తానంటూ బెదిరించేవాడు. దీంతో భయపడిన బాధితురాలి ఫిర్యాదు మేరకు వంశీతోపాటు అతని తల్లి లక్ష్మి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతకు 'వికసిత్ భారత్' పోటీలు

అనంతపురం కల్చరల్: వికసిత భారత్ యంగ్ లీడర్స్ నినాదంతో యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు ఆన్‌లైన్ ద్వారా అక్టోబరు 15 వరకు సాగుతాయి. తెలుగుతో పాటు 12 భాషల్లో పోటీ పడవచ్చు. ఈ మేరకు ఆన్‌సెట్, యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు https:// mybharat. gov. in/ pages/ vbyld&2026 వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

'పురం'లో నేడు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పాఠశాల క్రీడా మైదానం వేదికగా ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ శుక్రవారం పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరు కానున్నారు. విజేతలు అయోధ్యలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించనున్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కదిరిలోని చౌట్రీ వీధికి చెందిన డాక్టర్ పి.నరసింహరాజు, పంకజరాణి దంపతులు తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. ఏటా దసరా సందర్భంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు రోజూ సాయంత్రం మహిళలతో పాటు పిల్లలను ఆహ్వానించి సంప్రదాయాలు, నీతి కథలు, పురాణ గాథలు, ఇతిహాసాలు అర్థమయ్యేలా బొమ్మల కొలువు ద్వారా తెలియజేస్తున్నామని వివరించారు.

– కదిరి

ప్రశాంతి నిలయంలో వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం



వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు, సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: దేవీ శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రశాంతి నిలయంలో వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రారంభమైంది. తొలుత సత్యసాయి మహాసమాధి చెంత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణచంద్ర ఆడిటోరియానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన యజ్ఞ వేదిక వద్ద కృతువులు పూర్తి యజ్ఞం ప్రారంభించారు. వేలాది భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. వేద పండితులకు నూతన వస్త్రాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు అందజేశారు. సాయంత్రం ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ ఇన్నోవేషన్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ విభాగం డీన్ పల్లవ్ కుమార్ వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞంను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం నందగిరి క్యాంపస్ విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.


యజ్ఞంలో పాల్గొన్న భక్తులు